# కిశోర్‌కుమార్ గెలుపు సునాయాసం

- డీసీసీబీ డైరెక్టర్ సైదులు


తుంగతుర్తి : వెంపటి సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ సైదులు

తుంగతుర్తి, అక్టోబర్ 21 : అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ గెలుపు సునాయాసం అని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండలంలోని వెంపటి గ్రామంలో సర్పంచ్ అబ్బగాని పద్మాసత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కిశోర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే నాయకుడిని భారీ మెజారిటీతో గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. బూత్ కమిటీ సభ్యులు ప్రభుత్వ పథకాలతో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరించాలన్నారు. ఈ 29న తిరుమలగిరిలో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ గుండగాని వీరస్వామి, ఉప సర్పంచ్ వెంకన్న, బాషబోయిన వెంకన్న, సొసైటీ డైరెక్టర్ యాకయ్య పాల్గొన్నారు.

### గెలుపే లక్ష్యంగా పని చేయాలి..

నాగారం : రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ హాట్రిక్ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని మార్కెట్ వైస్ చైర్మన్ యారాల రామ్‌రెడ్డి అన్నారు. బూత్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మామిడి పద్మారావు, సుల్తాన్ వేణు, యాదగిరి, లింగమల్లు, ఉప సర్పంచ్ ఈదుల కిరణ్, బండగొర్ల ఎల్లయ్య, అంజి పాల్గొన్నారు.


నాగారం : సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి

# ఈ ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


బతుకమ్మతో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

బొడ్రాయిబజార్, అక్టోబర్ 21 : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను ఈ సార్వత్రిక ఎన్నికల్లోనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నల్లాలబావి సెంటర్‌లో బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను, దేశాన్ని రక్షిద్దాం అనే నినాదంతో దేశ, రాష్ట్ర వ్యాప్తంగా జీపుజాత చేపట్టి మహిళల్లో చైతన్యం కల్పించినట్లు చెప్పారు. నియోజక వర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా మహిళా బిల్లును 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకన బోయిన సైదమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల జ్యోతి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పుల రజిత పాల్గొన్నారు.

# తుంగతుర్తి గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేద్దాం

- మరో అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి
- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- తిరుమలగిరి మండలంలో ఎన్నికల ప్రచారం


మామిడాల రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, అక్టోబర్ 21 : తుంగతుర్తి గడ్డపై మరోమారు గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మామిడాల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మామిడాల, కోక్యా నాయక్‌తండా, చింతలకుంటతండా గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చి విజయతిలకం దిద్దారు. వృద్ధులు ఆప్యాయంగా పలకరించి కొడుకా నీకే మా ఓటు అని చెప్పారు. గిరిజన మహిళలు, కళాకారులు సాంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు కూడళ్లలో స్థానికులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనను మూడోసారి ఆశీర్వదిస్తే తుంగతుర్తి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజక వర్గాన్ని రూ.16 వేల కోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అందుకే నియోజక వర్గం ప్రజలకు రెండోసారి సేవ చేసే అవకాశం కల్పించారన్నారు. ఇదే రీతిన మరోమారు ఉద్యమ స్ఫూర్తితో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. 30 ఏండ్లలో సాధ్యంకాని అభివృద్ధిని తాను తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో చేసినట్లు వివరించారు. గత ఐదేండ్లలో ఎన్నడూ ప్రజా సమస్యలు పట్టించుకోని వారు సంక్రాంతి పండుగకు గండిరెద్దులు వచ్చినట్లుగా ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. తమ ప్రభుత్వం అందజేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. తాను తిరిగి అధికారంలోకి వస్తే నియోజక వర్గాన్ని ఊహించని రీతిలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

### గత పాలకులు కనీసం గ్రామాలకు కూడా రాలేదు..

గతంలో పాలించిన పాలకులు కనీసం గ్రామాలు, ఆవాసాలకు వచ్చిన దాఖలాలు లేవన్నారు. తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలు పరిష్కరించిన విషయం ప్రజలకు తెలుసన్నారు. ప్రజలను ఏనాడు పట్టించుకోని వారు నేడు అభివృద్ధి చేస్తాం ఓటు వేయండని మాయమాటలు చెబుతున్నారు, వారి మాటలు నమ్మితే గోస పడుతామన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చినట్లు తెలిపారు. రైతు ఏ కారణం చేతనైనా చనిపోతే ఆ కుటుంబం వీధిన పడకుండా రూ.5 లక్షల బీమా ప్రభుత్వం అందించి ఆదుకుంటున్నట్లు చెప్పారు.


చింతలకుంట గ్రామంలో ప్రచారానికి హాజరైన ప్రజలు

### నెర్రెలు బారిన నేలలో సిరుల పంటలు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పొలాల్లో కనిపించాల్సిన తడి, అన్నదాత కళ్లలో కనిపించేది. కర్షకులు కరువు కోరల్లో చిక్కుకున్నారు. బంగారం పండాల్సిన భూములు నెర్రెలు బారి బీళ్లుగా మారాయి. సాగునీరు లేక విద్యుత్ అందక తెచ్చిన అప్పులు తీరక రైతులు కాలం చేశారు. అయినా నాటి ప్రభుత్వాలు స్పందించలేదు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఈ దుస్థితి పోవాలని ఉద్యమ నాయకుడైన సీఎం కేసీఆర్ సాగునీటితో పాటు విద్యుత్ సమస్యను రూపుమాపాడు. తాగునీటి కష్టాలు కూడా తీరాయి. ప్రస్తుతం చెరువులు, కుంటలు నిండుకుండల్లా జలకళ సంతరించుకున్నాయి. బీడు భూముల్లో సిరుల పంటలు పండుతున్నాయి. కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం నీళ్లతో నేడు తుంగతుర్తి పల్లెలు పచ్చని పంటలకు నిలయంగా మారాయన్నారు.

### బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం..

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఇంటికి పథకాలు అందాయన్నారు. తిరుమలగిరిని దళిత బంధు పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రతి ఒక్క దళిత కుటుంబానికి రూ.10 లక్షలు అందించడం జరిగిందన్నారు. మరింత అభివృద్ధి కోసం మరోమారు తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత, మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతి, జడ్పీటీసీ అంజలి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, సర్పంచులు బెడద కరుణాకర్, రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కొమ్మినేని సతీశ్, తిరుమణి యాదగిరి, తెడ్డు భాస్కర్, వేములు శ్రీనివాస్, వట్టె కృష్ణ, కృష్ణారెడ్డి, బర్ల వెంకన్న, బత్తుల శ్రీనివాస్, కందుకూరి లక్ష్మయ్య, షకీల్, మౌలానా, బాబు, సందీప్, యాకూబ్‌నాయక్, గోపాల్‌రెడ్డి, సురేందర్, పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ చివ్వేంల మండలాధ్యక్షుడిగా సతీశ్

చివ్వేంల, అక్టోబర్ 21 : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా దురాజ్‌పల్లికి చెందిన చెరుకుపల్లి సతీశ్‌మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శనివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు భవనంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తురుగంటి అంజయ్య చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకున్నాడు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

- దివ్యాంగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుబాబు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 21 : దివ్యాంగ ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని దివ్యాంగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగల మధుబాబు కోరారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహేశ్, గౌరవాధ్యక్షుడు సీతయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న పాల్గొన్నారు.

# పోలీస్ అమరుల త్యాగఫలం ప్రశాంత సమాజం

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, అక్టోబర్ 21 : నేటి ప్రశాంత సమాజం పోలీస్ అమరవీరుల ప్రాణాల త్యాగ ఫలితమేనని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, సిబ్బంది ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులు 24 గంటలు నిర్విరామంగా పని చేస్తూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రక్షణ కల్పిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేడు నక్సలైట్ల ప్రభావం తగ్గడంలో పోలీసుల వీరోచిత కృషి, ప్రాణ త్యాగ ఫలితమేనన్నారు. పోలీస్ అమరుల కుటుంబాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, వారి సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు, పౌరులు అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు భాగస్వామ్యమై అమర వీరులకు నివాళులర్పించాలన్నారు. పోలీస్ పరేడ్ కమాండర్‌గా ఆర్ఎస్ఐ రాజశేఖర్ వ్యవహరించారు. సంవత్సర కాలంలో దేశంలో అమరులైన 189 మంది పోలీస్ సిబ్బంది, జవాన్ల పేర్లను సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం చదివి వినిపించారు. పోలీసు కళాబృందం సభ్యులు అమరుల త్యాగాలను స్మరిస్తూ పాటలను ఆలపించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, ప్రకాశ్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ రామచందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఎన్నికల సెల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సీఐలు రాజశేఖర్, అశోక్ రెడ్డి, శివశంకర్, ఆర్ఐ నారాయణ, రాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


శాంతిర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

### దేశ రక్షణలో భాగస్వామ్యం అదృష్టం..

సూర్యాపేటసిటీ : దేశ రక్షణలో భాగస్వాములు కావడం అదృష్టమని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. దేశ రక్షణ రంగంలోకి ఇటీవల ఎంపికైన యువకులు రిటైర్డ్ కర్నల్ సుంకర శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ యువకులను అభినందించి మాట్లాడారు. అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం యువకులకు శిక్షణ ఇవ్వగా అందులో 18 మంది సైనికులుగా, 8 మంది సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికైనందుకు ఆనందంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

### పండుగలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి..

దసరా పండుగ కోసం సొంత ఊర్లకు వెళ్ళే ప్రజలు వారి నివాసాల వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సంబంధిత సమాచారాన్ని ఇంటి పక్కల వారికి, స్థానిక పోలీసులకు తెలుపాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. అలాగే సీసీ కెమెరాలను యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. విలువైన అభరణాలు, నగదు వెంట తీసుకెళ్లాలన్నారు. ఉత్సవాల దృష్ట్యా ప్రమాదాలకు దూరంగా ఉంటూ పండుగలు నిర్వహించుకోవాలని, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అతి వేగంగా వాహనాలు నడుపకుండా వెళ్లాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.